


విజన్ పక్షం

PRGI.TGBIL/26/A0206



ఎస్ఐఆర్ రగడ.. సుప్రీం మెట్లెక్కిన ఇండియా కూటమి నేతలు

సంపుటి:-01, సంచిక:-137, బుధవారం 14-10-2026, పేజీలు:-4, వెల: 2/-, ఎడిటర్:- ఎల్లని రాజేశ్వర్ గౌడ్ , పబ్లిషర్స్ : తెలంగాణ , ఆంధ్రప్రదేశ్

# రాహుల్‌గాంధీ చేపట్టిన ఉద్యమమే దేశాన్ని కాపాడబోతుంది

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- జ్ఞానేశ్‌కుమార్ గోబ్యాక్ ఉద్యమమే దేశాన్ని కాపాడబోతుంది
- వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమనే అంచనాతో వ్యతిరేకుల ఓట్లను బీజేపీ తొలగించే కుట్రలు చేస్తోందని రేవంత్ విమర్శించారు
- సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు



అధికారాన్ని పదిలం చేసుకొనేందుకు ఈడీ, ఐటీ అనేక అస్త్రాలు ప్రయోగించిన బీజేపీ, ఇప్పుడు ఎస్?ఐఆర్ అనే ఆయుధాన్ని ప్రయోగించిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాహుల్‌గాంధీ చేపట్టిన జ్ఞానేశ్‌కుమార్ గోబ్యాక్ ఉద్యమమే దేశాన్ని కాపాడబోతుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమనే అంచనాతో వ్యతిరేకుల ఓట్లను బీజేపీ తొలగించే కుట్రలు చేస్తోందని విమర్శించారు. సీఈసీ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో తలపెట్టిన ధర్నా కోసం దిల్లీ చేరుకున్న రేవంత్ రెడ్డి ఎస్?ఐఆర్ ప్రక్రియపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ ఓటు హక్కు కల్పించేందుకు ఎస్?ఐఆర్ తీసుకువస్తే, ఇప్పుడు ఓట్లను దూరం చేసేందుకు ఈ ప్రక్రియ చేపడుతున్నారని ఆరోపించారు.ఆనాడు సైమన్ గో బ్యాక్ ఉద్యమం దేశవ్యాప్తంగా ఉద్ధృతంగా సాగిందన్న రేవంత్ రెడ్డి అంబేద్కర్ ప్రపంచమంతా తిరిగి ఎన్నో రాజ్యాంగాలను అధ్యయనం చేశారని గుర్తు చేశారు. ఎంతో అధ్యయనం చేసి ఓటుహక్కును మన రాజ్యాంగంలో చేర్చారని, పాలకుడు రాచరికం, వంశపారంపర్యంగా - మిగతా 2 లో




## ప్రజల దాహం కంటే
# బీర్లే ముఖ్యమా?

- ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్
- సింగూరు ప్రాజెక్టు నీటిని మళ్లిస్తున్నారని హరీశ్ రావు ఆరోపణ
- రాష్ట్రంలో కరెంట్ కోతలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమన్న మాజీ మంత్రి
- కోట్ల మంది తాగునీటి అవసరాలను పట్టించుకోవడం లేదని విమర్శ

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత,హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు - మిగతా 2 లో

## ఈడీ, సీబీఐ సరిపోక
# ఈసీని వాడుకుంటున్నారు



- కేంద్రంపై రేవంత్ రెడ్డి ఫైర్
- కేంద్ర ప్రభుత్వం ఈసీని దుర్వినియోగం చేస్తోందన్న సీఎం రేవంత్
- ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరుతో బీజేపీ వ్యతిరేకుల ఓట్ల తొలగిస్తున్నారని ఆరోపణ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మోదీ సర్కార్ - మిగతా 2 లో

## 'NO' అని రిప్లై ఇచ్చినందుకే ఒకరి బ్యాంక్
# ఖాతా నిలువునా ఖాళీ అయిపోయింది!

- హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్
- వాట్సాప్‌లో 'N O' అని రిప్లై ఇస్తే బ్యాంక్ ఖాతా ఖాళీ
- ఇది సైబర్ నేరగాళ్ల సరికొత్త ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్
- ఓటీపీ, లింకులు లేకుండానే జరుగుతున్న మోసం
- గుర్తుతెలియని నంబర్లను బ్లాక్ చేయాలని సూచించిన సజ్జనార్
- మోసపోతే 1930కి కాల్ చేయాలని విజ్ఞప్తి



ఓటీపీ చెప్పాల్సిన పనిలేదు, అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయక్కర్లేదు.. కేవలం 'N O' అని రెండక్షరాల సమాధానం ఇస్తే చాలు.. మీ బ్యాంక్ ఖాతాలోని సొమ్ము క్షణాల్లో మాయం! సాంకేతికతను వాడుకుని సైబర్ నేరగాళ్లు పన్నిన ఈ సరికొత్త పన్నాగం ఇప్పుడు పెను సవాలుగా మారింది. 'ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్'గా పిలుస్తున్న ఈ ప్రమాదకరమైన మోసంపై ప్రజలు అత్యంత అప్రమత్తంగా - మిగతా 2 లో

## నిరసన స్థలంగా
# జంతర్ మంతర్ తొలగింపు




- స్థలాన్ని మార్చగలరేమో కానీ ప్రజాగ్రహాన్ని మార్చలేరన్న కాంగ్రెస్
- ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన స్థలం జాబితా నుంచి తొలగింపు
- ప్రభుత్వ నిర్ణయంపై తీవ్రంగా స్పందించిన కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు
- స్థలం మార్చగలరేమో కానీ, ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చలేరని వ్యాఖ్య
- ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, గొంతు నొక్కే ప్రయత్నమని ఆరోపణ
- ఢిల్లీలో నిరసనల కోసం రామ్‌లీలా మైదానం సహా మూడు కొత్త ప్రాంతాల గుర్తింపు

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించడంపై రాజకీయ దుమారం రేగింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నిర్ణయం ఏకపక్షమని, ప్రజాస్వామ్యంలో ప్రజలే నిరసన స్థలాన్ని నిర్ణయిస్తారని, ప్రభుత్వం కాదని నేతలు మండిపడ్డారు. ప్రభుత్వం నిరసన స్థలాన్ని మార్చగలదేమో కానీ, ప్రజల ఆగ్రహాన్ని తగ్గించలేదని స్పష్టం చేశారు.సోమవారం ఈ విషయంపై కాంగ్రెస్ ఎంపీ - మిగతా 2 లో

## ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి 2026

- రాబర్ట్ హోల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు పురస్కారం
- స్థూల ఆర్థిక స్థిరీకరణకు అవసరమైన సూక్ష్మ ఆర్థిక పునాదులపై పరిశోధనకు గుర్తింపు
- స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న హోల్
- వుడ్‌ఫోర్డ్ కొలంబియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్న వుడ్‌ఫోర్డ్
- ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకుల ఆర్థిక విధాన నిర్ణయాలకు వీరి పరిశోధనలు ప్రయోజనకరం
- ఆర్థిక శాస్త్ర బహుమతిని స్వీడన్ కేంద్ర బ్యాంకు 1968లో ఏర్పాటు




## సౌదీపై దాడి అమెరికా రంగంలోకి దిగితే
# యుద్ధం మరింత భీకరమేనా?





- సౌదీపై హూతీల దాడులతో పెరిగిన ప్రాంతీయ ఉద్రిక్తతలు
- యెమెన్‌లో సౌదీ మద్దతుతో ప్రభుత్వ దళాల ఎదురుదాడి
- అమెరికా ప్రత్యక్ష సైనిక చర్య చేపట్టే అవకాశంపై చర్చ
- సౌదీ రక్షణకు టర్కీ, పాకిస్థాన్ మద్దతు కీలకం
- హూతీల క్షిపణులు, డ్రోన్లు సౌదీకి సవాలు

## ఆంధ్రప్రదేశ్ స్థానిక ఎన్నికలు
# మున్సిపాలిటీల రిజర్వేషన్లు



- ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్లకు తుది రూపు
- మొత్తం 106 మున్సిపాలిటీలు, 17 కార్పొరేషన్లకు తుది జాబితా విడుదల
- మున్సిపాలిటీలలో బీసీలకు 35, ఎస్సీలకు 14, ఎస్టీలకు 3 చైర్మన్ పీఠాలు
- అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు 50 స్థానాలు కేటాయింపు
- రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది

ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న పురపాలక ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 106 మున్సిపాలిటీలు, 17 మున్సిపల్ కార్పొరేషన్లలో చైర్మన్, మేయర్ పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం తుది జాబితాను ప్రకటించింది. ఈ ప్రకటనతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో ఒక ముఖ్యమైన ఘట్టం పూర్తయింది. ఇక అన్ని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించేందుకు మార్గం సుగమమైంది.ప్రకటించిన జాబితా ప్రకారం, 106 మున్సిపాలిటీలలో ఛైర్మన్ పదవులకు గాను బీసీ (వెనుకబడిన తరగతులు) వర్గానికి 35 స్థానాలు, ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) వర్గానికి 14 స్థానాలు, ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు) వర్గానికి 3 స్థానాలు కేటాయించారు. అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు మొత్తం 50 స్థానాలు రిజర్వ్ చేయడం గమనార్హం. - మిగతా 2 లో





## రైతు బజార్లలో కిలో
# సన్నబియ్యం రూ.50కే

- ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఏపీ రైతు బజార్లలో కెఎన్ఎం సన్నబియ్యం విక్రయాలు
- రూ.49కే అందుబాటులో ఉన్న బీపీటీ బియ్యం
- పెరిగిన ధరల నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించే చర్య
- ఒక్కో కుటుంబానికి నెలకు 26 కిలోల ప్యాక్

సామాన్య ప్రజలకు ఊరట కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. - మిగతా 2 లో

# రూ.3222 కోట్ల విలువైన అభివృద్ధి పనులు

- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు
- తిరుపతిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు
- తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో రూ.3222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు



తిరుపతిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఇవాళ సచివాలయం నుంచి సీఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో రూ.3222 కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టారు. తిరుమల కొండపై రద్దీ తగ్గించేందుకు కింద తిరుపతిలో వసతి సౌకర్యాల విస్తరణ చేపట్టనున్నారు.తిరుమలకు వచ్చే భక్తులకు వసతి నుంచి అన్నప్రసాదం, పార్కింగ్ నుంచి రవాణా వరకు అన్ని సౌకర్యాలను ఒకేచోట కల్పించేలా ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్‌తో పాటు టీటీడీ ఉద్యోగుల నివాస లేఅవుట్, తిరుపతి నగరంలో తొమ్మిది మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. భక్తులకు అవసరమైన సమాచారం అందించేందుకు వెంకటాద్రి యాప్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.అలిపిరి వద్ద రూ.1332 కోట్లతో నాలుగు బ్లాకుల్లో 2700 గదులతో వసతి సముదాయాలను నిర్మించనున్నారు. వీటి ద్వారా రోజుకు 15,000ల మంది భక్తులకు వసతి కల్పించనున్నారు. రూ.160 కోట్లతో ఒకేసారి ఆరు వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందించే కేంద్రాన్ని, రూ.486 - మిగతా 2 లో

# సంపాదకీయం

## రసాయన రియాక్టర్లుగా డంప్‌యార్డులు!



స్వచ్ఛత అంటే చెత్తను కనిపించకుండా చేయడమేనా? లేక పర్యావరణానికి హాని కలగకుండా దాన్ని నిర్వహించడమా? భారత పట్టణాల వ్యర్థాల నిర్వహణ తీరును పరిశీలిస్తే మొదటి పద్ధతే పాటిస్తున్నారని అర్థమవుతోంది. ప్రతి ఉదయం మున్సిపల్ వాహనాలు వీధుల్లో చెత్తను సేకరిస్తాయి. ప్రజలు శుభ్రమైన రోడ్లను చూస్తారు. పాలకులు పరిశుభ్రత విజయాలను ప్రచారం చేసుకుంటారు. కానీ నగర శివార్లలో పడేసిన అదే చెత్త కొద్ది రోజుల్లో విషవాయువులు వెదజల్లే, భూగర్భ జలాలను కలుషితం చేసే, ప్రజారోగ్యానికి ముప్పుగా మారే రసాయన రియాక్టరుగా రూపాంతరం చెందుతూ ఉంటుంది. ఈ వాస్తవం ప్రజా చర్చల్లో ఎక్కడా చోటు దక్కించుకోదు.ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాల్లో అధిక భాగం సేంద్రియమే. అవి పశువులకు మేతగా, పొలాలకు ఎరువుగా, ప్రకృతిలో మళ్లీ కలిసిపోయే వనరులుగా ఉపయోగపడేవి. కానీ పట్టణ జీవనశైలి వ్యర్థాల స్వరూపాన్నే మార్చేసింది. ప్లాస్టిక్ సంచులు, ప్యాకేజింగ్ పదార్థాలు, వైద్య వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, బ్యాటరీలు, రసాయనాలు, నిర్మాణ వ్యర్థాలు, ఆహార అవశేషాలు అన్నీ ఒకే ట్రక్కులో చేరి, చివరకు ఒకే డంప్‌యార్డులో పడుతున్నాయి. అక్కడి నుంచి ప్రారంభమయ్యే రసాయన, జీవరసాయన చర్యలు సంవత్సరాల తరబడి కొనసాగుతుంటాయి. అందుకే ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు శాస్త్రీయ నిర్వహణ లేని డంప్‌యార్డుల్లాంటి స్థలాలను 'స్లో కెమికల్ రియాక్టర్లు'గా అభివర్ణిస్తున్నారు.డంప్‌యార్డు అనేది కేవలం చెత్త గుట్ట కాదు. అది నిరంతరం పనిచేసే జీవ, రసాయన ప్రయోగశాల. సేంద్రియ వ్యర్థాలు ఆక్సిజన్ లేని పరిస్థితుల్లో కుళ్లిపోవడంతో మీథేన్ వాయువు విడుదలవుతుంది. ఈ వాయువు కార్బన్ డై ఆక్సైడ్ కంటే అనేక రెట్లు ఎక్కువగా భూతాపాన్ని పెంచుతుంది. చెత్త గుట్టల్లో తరచూ చెలరేగే మంటలకు ఇదే కారణం. ఆ మంటల నుంచి విడుదలయ్యే డయాక్సిన్లు, ఫ్యూరాన్లు, సూక్ష్మ ధూళికణాలు ఊపిరితిత్తుల వ్యాధులకు, గుండె సమస్యలకు, క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉందని అనేక పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. వర్షాకాలంలో చెత్తలోంచి కారే లీచేట్ భూగర్భ జలాలను విషపూరితం చేస్తుంది. దశాబ్దాల పాటు ఆ ప్రభావం కొనసాగుతుంది.దేశవ్యాప్తంగా ప్రతి ఏటా పట్టణ ఘన వ్యర్థాల పరిమాణం పెరుగుతూనే ఉంది. కానీ దానికి అనుగుణంగా శాస్త్రీయ ప్రాసెసింగ్ కేంద్రాలు, రీసైక్లింగ్ వ్యవస్థలు, కంపోస్టింగ్ యూనిట్లు, వ్యర్థాల నుంచి శక్తి ఉత్పత్తి చేసే ప్రాజెక్టులు పెరగడం లేదు. ఫలితంగా ప్రతి నగరం తన శివార్లలో ఒక కొత్త పర్యావరణ సంక్షోభాన్ని సృష్టిస్తోంది.తెలంగాణ పరిస్థితి దీనికి మినహాయింపు కాదు. హైదరాబాద్‌లో ఇంటింటికీ చెత్త సేకరణ, యాంత్రిక శుభ్రత వంటి అంశాల్లో గణనీయమైన పురోగతి కనిపించినా, నగరం రోజూ ఉత్పత్తి చేస్తున్న వేల టన్నుల వ్యర్థాలను పూర్తిగా శాస్త్రీయంగా నిర్వహించడం ఇప్పటికీ సవాలుగానే ఉంది. వరంగల్‌లోని రాంపూర్ డంప్ యార్డు పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి నగరాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.స్వచ్ఛ భారత్ మిషన్ వల్ల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెరిగింది. అనేక నగరాలు స్వచ్ఛత ర్యాంకుల్లో పోటీ పడుతున్నాయి. అయితే ఆ ర్యాంకుల్లో నగర వీధుల పరిశుభ్రతకు ఇచ్చిన ప్రాధాన్యం, డంప్‌యార్డుల శాస్త్రీయ నిర్వహణకు కూడా సమానంగా లభించిందా? అనే ప్రశ్నకు సమాధానం అంత సంతృప్తికరంగా లేదు. వీధుల్లో కనిపించని చెత్త, పట్టణ శివార్లలో కనిపించే పర్యావరణ విపత్తుగా మారితే దాన్ని అభివృద్ధి అనలేం.వేగంగా పట్టణీకరణ చెందుతున్న రాష్ట్రంగా పాత తప్పులను పునరావృతం చేయకుండా కొత్త నమూనాను అవలంబించే అవకాశం తెలంగాణకు ఉంది. ఇక్కడి నగరాల్లో భవిష్యత్తు వ్యర్థాల ఉత్పత్తిని దృష్టిలో ఉంచుకొని సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి. ఇప్పటికే పేరుకుపోయిన చెత్త గుట్టలను బయోమైనింగ్ ద్వారా వేగంగా తొలగించాలి. మీథేన్‌ను వృథా కాకుండా విద్యుత్ ఉత్పత్తికి వినియోగించాలి. లీచేట్ శుద్ధి కేంద్రాలు, భూగర్భ జలాల నాణ్యత పర్యవేక్షణ, ఆధునిక రీసైక్లింగ్ వ్యవస్థలు ప్రతి నగరంలో తప్పనిసరి కావాలి.పౌరుల బాధ్యత కూడా అంతే ముఖ్యమైనది. ఇంటి వద్దే చెత్తను వేరు చేయడం, ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, స్థానిక సంస్థలతో సహకరించడం ప్రతి కుటుంబం అలవాటు చేసుకోవాలి. ప్రతి నగరం తన చెత్తను తానే బాధ్యతగా నిర్వహించగలిగినప్పుడే నిజమైన పరిశుభ్రత సాధ్యమవుతుంది. లేకపోతే మనం నిర్మిస్తున్నవి డంప్‌యార్డులు కాదు... భవిష్యత్ తరాలకు విషాన్ని తయారు చేసే భారీ రసాయన రియాక్టర్లే.

## రూ.3222 కోట్ల విలువైన అభివృద్ధి పనులు

మొదటిపేజీ తరువాయి - కోట్లతో నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లను అభివృద్ధి చేయనున్నారు. వీటిలో ఒకేసారి 16,000ల మంది భక్తులు విశ్రాంతి తీసుకునే సౌకర్యాలు కల్పించనున్నారు.అదేవిధంగా రూ.311 కోట్లతో 4500 వాహనాలు నిలిపే బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం, రూ.90 కోట్లతో 30 బస్ బేలతో ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ నిర్మించనున్నారు. పిలిగ్రిమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, డిజిటల్ సమాచార కేంద్రం, అత్యవసర వైద్య సహాయ కేంద్రాలు, ఆధునిక భద్రతా వ్యవస్థలను కూడా ఏర్పాటు చేయనున్నారు. తిరుమలపై రద్దీని తగ్గించి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేయనున్నారు.మరోవైపు, 418 ఎకరాల్లో 5192 మంది టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కల్పించేందుకు రూ.230 కోట్లతో మౌలిక వసతులు అభివృద్ధి చేయనున్నారు. తిరుపతి నగరంలో రూ.242 కోట్లతో తొమ్మిది మాస్టర్ ప్లాన్ రోడ్లతో పాటు, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి మూడు మాస్టర్ ప్లాన్ రహదారులను అభివృద్ధి చేయనున్నారు. ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ రెండేళ్లలో పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. దేవుడి కోసం పనిచేసే ఏజెన్సీలకు అవకాశం ఇవ్వాలని చెప్పారు. తిరుమలలోని వాతావరణం ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్‌లో ఉండాలని తెలిపారు. తిరుపతిలో పవిత్రమైన వాతావరణం లేకపోతే మంచిది కాదని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## రైతు బజార్లలో కిలో సన్నబియ్యం రూ.50కే

మొదటిపేజీ తరువాయి - బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, రైతు బజార్ల ద్వారా నాణ్యమైన సన్నబియ్యాన్ని సరసమైన ధరకే అందించేందుకు శ్రీకారం చుట్టింది. నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు బజార్లలో కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్ రకం సన్నబియ్యాన్ని కిలో రూ. 50కే విక్రయిస్తున్నారు.ఇప్పటికే రైతు బజార్లలో బీపీటీ రకం బియ్యం కిలో రూ. 49కు అందుబాటులో ఉండగా, తాజాగా కేఎన్ఎం రకాన్ని కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఒక్కో కుటుంబానికి నెలకు 26 కిలోల ప్యాకింగ్‌ను పంపిణీ చేయనున్నారు. బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం ధర కిలో రూ. 90 వరకు ఉన్న తరుణంలో, ప్రభుత్వ నిర్ణయం సామాన్యులకు భారీ ఊరటనివ్వనుంది. నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకే ప్రజలకు చేరవేయడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం.ఈ విక్రయాలను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విజయవాడలోని భవానీపురం రైతు బజార్‌లో నేడు లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలు తమ సమీపంలోని రైతు బజార్లను సంప్రదించి ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించింది.

## రాహుల్‌గాంధీ చేపట్టిన ఉద్యమమే దేశాన్ని కాపాడబోతుంది

మొదటిపేజీ తరువాయి - కాకుండా ప్రజలు ఎన్నుకునే పద్ధతి తీసుకువచ్చారని కొనియాడారు. 1950లో తొలిసారి ఎస్ఐఆర్ పద్ధతిని అమలు చేశారని పేర్కొన్నారు.బీజేపీ వ్యతిరేకుల ఓట్లు తొలగించాలని జ్ఞానేశ్‌కుమార్‌ను టాస్క్ ఇచ్చారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రధానంగా బీజేపీని వ్యతిరేకించేదని, యువత, నిరుద్యోగులు, పేదలు, ఇప్పుడు యువత, నిరుద్యోగులు, పేదల ఓట్లు తొలగించాలని జ్ఞానేశ్‌కుమార్ చూస్తున్నారని ఆరోపించారు. ఎస్ఐఆర్‌లో తప్పులు జరుగుతున్నాయని మిగతా ఇద్దరు ఈసీలు వ్యతిరేకించారని, జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు బయటపడిందని విమర్శించారు. అలాంటి జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించేందుకు ప్రధాని మోదీకి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు."సర్ ప్రక్రియ జరగని రాష్ట్రాల్లో బీజేపీ ఓడిపోయింది. సర్ ప్రక్రియ జరిగిన బిహార్, బంగాల్‌లో బీజేపీ గెలిచింది. దేశంలో జనాభా పెరుగుతుంటే ఓటర్ల సంఖ్య కూడా పెరగాలి కదా. మరి దేశంలో ఓటర్ల సంఖ్య 97 కోట్ల నుంచి 81 కోట్లకు ఎందుకు తగ్గింది?. దళితులు, ఆదివాసీలు, యువత, నిరుద్యోగుల్లో బీజేపీపై వ్యతిరేకత ఉంది".బీజేపీ వ్యతిరేకులైన దళితులు, ఆదివాసీలు, యువత, నిరుద్యోగుల ఓట్లను తొలగిస్తున్నారని సీఎం ఆరోపించారు. పేదలను ఓటు లేని నిరాయుధులుగా మార్చాలని బీజేపీ కుట్ర చేస్తోందని విమర్శించారు. రాహుల్‌గాంధీ చేపట్టిన జ్ఞానేశ్‌కుమార్ గోబ్యాక్ ఉద్యమమే దేశాన్ని కాపాడబోతుందని, దేశ మనుగడకు సంబంధించిన ఉద్యమంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# ఆంధ్రప్రదేశ్ స్థానిక ఎన్నికలు.. మున్సిపాలిటీల రిజర్వేషన్లు

మొదటిపేజీ తరువాయి - కేటగిరీల వారీగా రిజర్వ్ చేయబడిన పురపాలక సంఘాల పూర్తి వివరాలు కింద ఇవ్వబడ్డాయి.

కేటగిరీల వారీగా పురపాలక సంఘాల జాబితా

ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు) – 3

ఎస్టీ – మహిళ: గూడూరు

ఎస్టీ – జనరల్: ఆత్మకూరు, ఆలూరు

ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) – 14

ఎస్సీ – మహిళ: కొండపల్లి, నిడదవోలు, యలమంచిలి, చింతలపూడి, సూళ్లూరుపేట, గుత్తి, చీరాల.

ఎస్సీ – జనరల్: ఉయ్యూరు, నూజివీడు, కుప్పం, సామర్లకోట, పిఠాపురం, బాపట్ల, పొదిలి.

బీసీ (వెనుకబడిన తరగతులు) – 35

బీసీ – మహిళ: జంగారెడ్డిగూడెం, నర్సీపట్నం, నాయుడుపేట, చిలకలూరిపేట, ఇచ్ఛాపురం, కొవ్వూరు, పాలకొల్లు, గుంతకల్, గుడివాడ, నందిగామ, ముమ్మిడివరం, మదనపల్లె, నరసరావుపేట, అమలాపురం.

బీసీ – జనరల్: కావలి, కదిరి, బి.కొత్తకోట, కందుకూరు, హిందూపురం, ఆత్మకూరు (నెల్లూరు), అద్దంకి, కమలాపురం,



నెల్లిమర్ల, మడకశిర, ఆళ్లగడ్డ, గురజాల, దాచేపల్లి, గొల్లప్రోలు, మార్కాపురం, నంద్యాల, బేతంచెర్ల, నందికొట్కూరు, దర్శి, గూడూరు (కర్నూలు), మైదుకూరు, బద్వేల్.

జనరల్ కేటగిరీ (మహిళ)

ఈ కేటగిరీ కింద మొత్తం 27 మున్సిపాలిటీలను మహిళలకు కేటాయించారు.కనిగిరి, వెంకటగిరి, నరసాపురం, పలాస-కాశీబుగ్గ, పెడన, పలమనేరు, జమ్మలమడుగు, ఆకివీడు, పాలకొండ, పొన్నూరు, భీమవరం, జగ్గయ్యపేట, బుచ్చిరెడ్డిపాలెం, యర్రగుంట్ల, యలమంచిలి, కళ్యాణదుర్గ్, ఆమదాలవలస, పుంగనూరు, మాచర్ల, రాజంపేట, ఆదోని, డోన్, రాజాం, బొబ్బిలి, రేపల్లె, పులివెందుల, ఎమ్మిగనూరు.

అన్‌రిజర్వ్ (జనరల్)

కింది 26 మున్సిపాలిటీలు ఏ రిజర్వేషన్ పరిధిలోకి రాకుండా అన్‌రిజర్వ్‌గా ఉన్నాయి.పుట్టపర్తి, పెనుకొండ, రాయచోటి, సాలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, తెనాలి, రామచంద్రాపురం, సత్తెనపల్లె, శ్రీకాళహస్తి, తుని, పార్వతీపురం, ప్రొద్దుటూరు, పుత్తూరు, మండపేట, నగరి, చీమకుర్తి, తిరువూరు, రాయదుర్గ్, గిద్దలూరు, వినుకొండ, పెద్దాపురం, ధర్మవరం, తాడిపత్రి, పిడుగురాళ్ల.ఈ అధికారిక ప్రకటన వెలువడటంతో, మున్సిపల్ ఎన్నికలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ కూడా వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ రిజర్వేషన్ల ఆధారంగా ప్రధాన రాజకీయ పక్షాలు తమ వ్యూహాలకు పదునుపెట్టడం, బలమైన అభ్యర్థులను నిలబెట్టేందుకు కసరత్తులు ప్రారంభించనున్నాయి. రాబోయే రోజుల్లో పురపాలక రాజకీయాలు మరింత వేడెక్కనున్నాయి.

## నిరసన స్థలంగా జంతర్ మంతర్ తొలగింపు

మొదటిపేజీ తరువాయి - మనీశ్ తివారీ మాట్లాడుతూ, "ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నాం. అందుకే ప్రతిపక్షాలన్నీ కలిసి బారాఖంబా రోడ్డుకు వెళ్తున్నాం. సాధారణంగా బోట్ క్లబ్‌లో నిరసనలు జరుగుతాయి. మీరు నిరసన వేదికలను మార్చవచ్చు, కానీ ప్రజల కోపాన్ని తగ్గించలేరు" అని అన్నారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా స్పందిస్తూ, "దీన్ని ఎలా రద్దు చేస్తారు? ప్రజాస్వామ్యంలో ఎక్కడ నిరసన చేయాలో ఎవరు నిర్ణయిస్తారు? అన్యాయం, అణచివేతకు వ్యతిరేకంగా గళం విప్పడానికి భారతదేశంలోని ప్రతి అంగుళం స్వేచ్ఛాయుతమైనదే. ఈ స్వేచ్ఛను మాకు రాజ్యాంగం ఇచ్చింది" అని పేర్కొన్నారు.మరికొందరు కాంగ్రెస్ నేతలు తమదైన శైలిలో వ్యంగ్యంగా విమర్శలు గుప్పించారు. "ప్రభుత్వం ఈ దేశ పౌరులుగా మమ్మల్ని గుర్తించడం లేదు కాబట్టి, బంగ్లాదేశ్, చైనా వంటి దేశాల్లో ఎక్కడైనా నిరసన స్థలం చూపిస్తే అక్కడికి వెళ్లి నిరసన తెలుపుతాం" అని సందీప్ దీక్షిత్ అన్నారు. హరియాణా ప్రతిపక్ష నేత భూపిందర్ సింగ్ హుడా మాట్లాడుతూ.. ప్రభుత్వం భయపడి ఉందని, ప్రజల గొంతు నొక్కాలని చూస్తోందని ఆరోపించారు. "ఢిల్లీ వారి తండ్రి ఆస్తి అన్నట్లుగా.. ఇక ఢిల్లీకి రావద్దని కూడా చెబుతారు" అని ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ విమర్శించగా, "ఇకపై హిమాలయాల శిఖరాలపై నిరసన చేస్తాం" అని మరో ఎంపీ ఇమ్రాన్ మసూద్ వ్యాఖ్యానించారు.హోం మంత్రిత్వ శాఖ కమిటీ సిఫార్సుల మేరకు జంతర్ మంతర్‌ను నిరసనల కోసం నిర్దేశించిన స్థలం జాబితా నుంచి డీ-నోటిఫై చేసినట్లు ఢిల్లీ పోలీసులు అధికారిక ప్రకటన విడుదల చేశారు. నిరసనల కోసం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం, బురారీ గ్రౌండ్, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్ అనే మూడు కొత్త ప్రదేశాలను కేటాయించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం కేంద్రం, ప్రతిపక్షాల మధ్య మరో రాజకీయ ఘర్షణకు దారితీసింది.

## ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి 2026

మొదటిపేజీ తరువాయి -

ఆర్థిక శాస్త్రంలో 2026 నోబెల్ బహుమతిని అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఈ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు ప్రకటించారు. స్థూల ఆర్థిక వ్యవస్థలో ఒడుదొడుకులను నియంత్రించేందుకు ఉపయోగపడే నమూనాల రూపకల్పనకు అవసరమైన సూక్ష్మ ఆర్థిక పునాదులపై వారు చేసిన పరిశోధనకు ఈ పురస్కారం దక్కింది. స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ఈ విషయాన్ని ప్రకటించింది.రాబర్ట్ ఈ. హాల్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మైఖేల్ వుడ్‌ఫోర్డ్ కొలంబియా యూనివర్సిటీలో రాజకీయ ఆర్థికశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. వీరి పరిశోధనలు ఆర్థిక వ్యవస్థలో వృద్ధి, మాంద్యం వంటి పరిస్థితులను ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు తోడ్పడతాయి. ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులను అర్థం చేసుకుని తగిన విధాన నిర్ణయాలు తీసుకోవడంలో ఈ అధ్యయనాలు కీలకంగా నిలుస్తాయి.ఆర్థిక శాస్త్రంలో ఈ పురస్కారాన్ని అధికారికంగా 'ఆల్ఫ్రెడ్ నోబెల్ స్మారకార్థం స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ ఆర్థిక శాస్త్ర బహుమతి' అని పిలుస్తారు. స్వీడన్ కేంద్ర బ్యాంకు 1968లో దీన్ని ఏర్పాటు చేసింది. 1969లో తొలిసారిగా ప్రదానం చేశారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో పేర్కొన్న అసలు ఐదు నోబెల్ బహుమతుల్లో ఆర్థిక శాస్త్ర పురస్కారం లేదు. అయినప్పటికీ మిగతా నోబెల్ పురస్కారాలతో పాటే ఏటా డిసెంబర్ 10న దీన్ని అందజేస్తారు. 1896లో అదే రోజున నోబెల్ మరణించారు.2025లో ఈ బహుమతి జోయెల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లకు లభించింది. సాంకేతిక పురోగతి, నూతన ఆవిష్కరణలు దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి ఎలా దోహదపడతాయో వివరించినందుకు వారిని ఎంపిక చేశారు.

## సౌదీపై దాడి.. అమెరికా రంగంలోకి దిగితే యుద్ధం మరింత భీకరమేనా?

మొదటిపేజీ తరువాయి - మధ్యప్రాచ్యంలో ఇప్పటికే రగులుతున్న యుద్ధాగ్ని మరింత విస్తరించే ప్రమాదం కనిపిస్తోంది. సౌదీ అరేబియాపై హూతీల దాడులు.. యెమెన్‌లో సౌదీ మద్దతుతో జరుగుతున్న సైనిక చర్యలు.. అమెరికా ప్రత్యక్షంగా రంగంలోకి దిగే అవకాశాలు.. ఈ పరిణామాలన్నీ ప్రాంతీయ సంక్షోభాన్ని మరో స్థాయికి తీసుకెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. సౌదీపై దాడులతో మొదలైన తాజా ఉద్రిక్తత.. అమెరికా, టర్కీ, పాకిస్థాన్‌లనూ ఈ ఘర్షణలోకి లాగుతుందా? అన్న ఆందోళనలు పెరుగుతున్నాయి.సౌదీ రాజధాని రియాద్‌లోని ప్రధాన విమానాశ్రయంపై శనివారం జరిగిన దాడిలో 12 మంది మరణించగా, దాదాపు 300కు పైగా మంది గాయపడ్డారు. ఆదివారం మరో దాడిలో ఒకరు మరణించగా, 11 మంది గాయపడ్డారు. ఈ దాడులకు తామే బాధ్యులమని హూతీలు ప్రకటించారు. యెమెన్ రాజధాని సనాపై సౌదీ దాడులకు ప్రతిస్పందనగానే వీటిని చేపట్టినట్లు పేర్కొన్నారు.యెమెన్‌లో కీలక ప్రాంతాలపై హూతీలు పట్టు సాధించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఎర్ర సముద్రం దక్షిణ ద్వారం వద్ద ఉన్న 'బాబ్ అల్ మండెబ్' జలసంధి సమీపంలో హూతీలు భూభాగాలను ఆక్రమించారు. ప్రపంచ వాణిజ్య నౌకాయానానికి ఈ మార్గం అత్యంత కీలకం. దీంతో యెమెన్ ప్రభుత్వ దళాలు ఎదురుదాడి ప్రారంభించాయి. వాటికి సౌదీ యుద్ధవిమానాలు మద్దతిస్తున్నాయి. హూతీల అధీనంలోని మొఖా ఓడరేవును తిరిగి స్వాధీనం చేసుకున్నామని సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో హూతీలు సౌదీపై దాడులను తీవ్రతరం చేస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.సౌదీపై దాడుల్లో ఓ అమెరికా పౌరుడు మరణించడంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఒత్తిడి పెరుగుతోంది. హూతీలపై అమెరికా దాడులు చేపడుతుందా? అని ప్రశ్నించగా.. ఆ అవకాశాన్ని పరిశీలిస్తామని ట్రంప్ చెప్పారు. సౌదీకి ప్రత్యక్ష సైనిక సహాయం, గగనతల రక్షణ వ్యవస్థల బలోపేతం, నిఘా సమాచారాన్ని పంచుకోవడం వంటి చర్యలు అవసరమని అమెరికా నిఘా విభాగంలో పనిచేసిన విలియం ఉషర్ అభిప్రాయపడ్డారు. అయితే ఇరాన్‌తో ఉద్రిక్తతలు మరింత పెరగకుండా చూడాలన్నది వాషింగ్టన్ ముందున్న సవాలు.సౌదీపై దాడులతో విమానాశ్రయ కార్యకలాపాలు నిలిచిపోయాయి. అంతర్జాతీయ విమానయాన సంస్థలు అప్రమత్తమయ్యాయి. రియాద్‌లో జరగాల్సిన కీలక వ్యాపార కార్యక్రమాలపైనా ప్రభావం పడుతోంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్న సౌదీకి ఈ పరిణామాలు సవాలుగా మారాయి. మరోవైపు, హూతీల వద్ద ఇరాన్ రూపకల్పన చేసిన బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లు ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. చౌకగా తయారు చేయగల డ్రోన్లతో సుదూర దాడులు చేసే సామర్థ్యం ఆ ముఠాకు ఉండటం సౌదీకి పెద్ద సమస్యగా మారింది.హూతీల దాడులను అడ్డుకోవడం సౌదీకి అంత సులభం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతంలో సౌదీ, అమెరికా దాడులను ఎదుర్కొన్నప్పటికీ ఆ ముఠా తన సామర్థ్యాలను నిలబెట్టుకుంది. ఇప్పుడు సౌదీ మరింత తీవ్రంగా స్పందిస్తే హూతీలు ప్రతిదాడులకు దిగే అవకాశం ఉంది. అమెరికా ప్రత్యక్షంగా రంగంలోకి దిగితే ఘర్షణ మరింత విస్తరించవచ్చు. అదే జరిగితే యెమెన్‌కే పరిమితమైన పోరు.. మధ్యప్రాచ్యంలోని మరిన్ని దేశాలను ప్రభావితం చేసే సంక్షోభంగా మారే ప్రమాదం ఉంది.

## 'NO' అని రిప్లై ఇచ్చినందుకే ఒకరి బ్యాంక్ ఖాతా నిలువునా ఖాళీ అయిపోయింది!

మొదటిపేజీ తరువాయి - ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. ఈ మోసం ఎలా పనిచేస్తుందో, దాని నుంచి ఎలా రక్షించుకోవాలో ఆయన సమగ్రంగా వివరించారు.సైబర్ కేటుగాళ్లు పక్కా ప్రణాళికతో ఈ మోసానికి పాల్పడుతున్నారు. ముందుగా, గుర్తుతెలియని వాట్సాప్ నంబర్ నుంచి మీ ఫోన్‌కు ఒక సందేశం వస్తుంది. 'మీ బ్యాంక్ ఖాతా నుంచి ఇంత మొత్తం డెబిట్ అయ్యింది' అని ఆ మెసేజ్‌లో ఉంటుంది. అది చూసిన వెంటనే ఎవరైనా కంగారుపడటం సహజం. ఆ కంగారును ఆసరాగా చేసుకుని, వెంటనే మరో సందేశం పంపుతారు. 'ఈ లావాదేవీ మీరు చేయకపోతే, వెంటనే చీ అని రిప్లై ఇవ్వండి' అని అందులో సూచిస్తారు. ఖాతాలో డబ్బులు పోయాయన్న ఆందోళనతో చాలామంది ఆలోచించకుండా 'చీ' అని టైప్ చేసి పంపేస్తారు.అక్కడే అసలు మోసం దాగి ఉంది. మీరు 'చీ' అని సమాధానం పంపిన మరుక్షణమే, ఆ సందేశంలో కంటికి కనిపించకుండా దాగి ఉన్న మాల్‌వేర్ స్క్రిప్ట్ లేదా ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్స్ యాక్టివేట్ అవుతాయి. ఈ ఫైల్స్ హ్యాకర్లకు మీ మొబైల్ ఫోన్‌పై పూర్తి నియంత్రణను (రిమోట్ యాక్సెస్) అందిస్తాయి. దీంతో వారు మీ ఫోన్‌లోని బ్యాంకింగ్ యాప్‌లు, పాస్‌వర్డ్‌లు, ఇతర సున్నితమైన సమాచారాన్ని సులభంగా దొంగిలించి, క్షణాల్లో మీ బ్యాంక్ ఖాతాను పూర్తిగా ఖాళీ చేస్తారు. ఇటీవల ఓ చార్టర్డ్ అకౌంటెంట్ సైతం ఈ మోసం బారిన పడి భారీగా నష్టపోయిన ఘటన ఈ దాడి తీవ్రతకు అద్దం పడుతోంది.గుర్తుతెలియని నంబర్ల నుంచి బ్యాంక్ లావాదేవీల పేరుతో వచ్చే సందేశాలకు ఎట్టిపరిస్థితుల్లోనూ "జూ" లేదా 'చీ' అని రిప్లై ఇవ్వకూడదు.అలాంటి సందేశాలు రాగానే కంగారు పడకుండా, వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్ చేసి, చాట్‌ను పూర్తిగా డిలీట్ చేయాలి. నిజంగా మీ ఖాతా నుంచి డబ్బు కట్ అయిందో లేదో తెలుసుకోవడానికి మీ బ్యాంక్ అధికారిక మొబైల్ యాప్ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెక్ చేసుకోవాలి. వాట్సాప్ సందేశాలను అస్సలు నమ్మవద్దు.ఏ అధికారిక బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ కూడా వాట్సాప్ ద్వారా ఇలాంటి లావాదేవీల ధ్రువీకరణ కోరదని గుర్తుంచుకోవాలి.ఒకవేళ పొరపాటున ఎవరైనా ఈ మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా 'గోల్డెన్ అవర్'లో స్పందించాలని సజ్జనార్ సూచించారు. వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ '1930'కి కాల్ చేయాలి. లేదా ఎఎవతీఎతీఅఎవ.స్రశీఙ.అఅ వెబ్ సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే, దొంగిలించబడిన డబ్బును ఫ్రీజ్ చేసి తిరిగి రాబట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆయన వివరించారు. కంగారులో ఇచ్చే ఒక్క సమాధానం జీవితకాల సంపాదనను హరించివేయగలదని, కాబట్టి ప్రతి ఒక్కరూ అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు



మొదటిపేజీ తరువాయి - ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) కూడా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అడ్డం పెట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగించే బాధ్యతను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు అప్పగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 1950లో ప్రజలకు ఓటు హక్కు కల్పించడానికి తీసుకొచ్చిన ఈ ప్రక్రియను, ఇప్పుడు బీజేపీ తన వ్యతిరేకుల ఓట్లను తొలగించడానికి వాడుకుంటోందని విమర్శించారు. ఈ చర్యల ద్వారా.. బీజేపీని వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు.ఈసీలోని మిగతా ఇద్దరు కమిషనర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలోని లోపాలను వ్యతిరేకించారని, దీనివల్ల జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు బయటపడ్డాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అలాంటి అధికారిని తొలగించడానికి ప్రధాని నరేంద్ర మోదీకి అభ్యంతరం ఎందుకని ఆయన ప్రశ్నించారు. బీజేపీ మత, ప్రాంతీయ ప్రాతిపదికన ప్రజలను విభజించి, ధనవంతులు-బీజేపీ మద్దతుదారులు ఒకవైపు, పేదలు-గిరిజనులు-బీజేపీ వ్యతిరేకులు మరోవైపు అనేలా రెండు వర్గాలుగా చూస్తోందని ఆరోపించారు.ఈ పరిస్థితిని మరో స్వాతంత్ర్య సంగ్రామంగా అభివర్ణించిన రేవంత్, రాహుల్ గాంధీ చేపట్టిన 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' ఉద్యమం దేశాన్ని కాపాడుతుందని అన్నారు. గతంలో జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని రాహుల్ గాంధీ వ్యతిరేకించిన విషయాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## ప్రజల దాహం కంటే బీర్లే ముఖ్యమా?



మొదటిపేజీ తరువాయి - గుప్పించారు. కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలను పక్కనపెట్టి, బీర్ ఫ్యాక్టరీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... ప్రభుత్వం నీటి, విద్యుత్ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు.సింగూరు ప్రాజెక్టు అంశాన్ని హరీశ్ రావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. మరమ్మతుల పేరుతో ప్రాజెక్టు నుంచి 29 టీఎంసీల నీటిని ఖాళీ చేసి, పనులను అసంపూర్తిగా వదిలేశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నా, దానిని బీర్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ చర్య వల్ల హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రజల తాగునీటి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాల వల్లే రాష్ట్రంలో కరెంట్ కోతలు పెరిగాయని, ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హరీశ్ రావు అన్నారు. ఎల్ నినో ప్రభావంపై ముందుగానే హెచ్చరికలు ఉన్నప్పటికీ, దేవాదుల, కల్వకుర్తి వద్ద నీటిని లిఫ్ట్ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, ఇది కృత్రిమ కరవుకు దారితీసిందని దుయ్యబట్టారు. మద్యం కంపెనీలకు నీటి కొరత రాకూడదని ఎక్సైజ్ మంత్రి వ్యాఖ్యానించడాన్ని ఆయన తప్పుపట్టారు.

# సీఎంసీ కూల్చివేతల చర్యలు

## అనధికార నిర్మాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్







**సైబరాబాద్ ప్రతినిధి , అక్టోబర్ 13(విజన్ పక్షం):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జవీజ) పరిధిలోని మూడు జోన్లలో అనధికార నిర్మాణాలపై క్షేత్రస్థాయి తనిఖీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు కొనసాగుతున్నాయి. భవన నిర్మాణ నిబంధనల అమలును నిర్ధారించే లక్ష్యంతో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 15 అనధికార నిర్మాణాలను గుర్తించగా, 16 నిర్మాణాలను కూల్చివేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యల్లో భాగంగా 2 నోటీసులు కూడా జారీ చేశారు.

**జోన్‌ల వారీగా చేపట్టిన కూల్చివేతల వివరాలు:**

సెరిలింగంపల్లి జోన్: 5

కూకట్‌పల్లి జోన్: 4

కుత్బుల్లాపూర్ జోన్: 7

జవీజ పరిధిలో క్షేత్రస్థాయి తనిఖీలను కొనసాగిస్తూ, గుర్తించిన అనధికార నిర్మాణాలపై నిర్దేశిత విధానం మరియు వర్తించే నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. భవన నిర్మాణ నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తూ, అనధికార నిర్మాణాలపై అవసరమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ మరియు తదుపరి చర్యలు కొనసాగించనున్నారు.

# కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



**హైదరాబాద్ (తెలంగాణ) అక్టోబర్ 13(విజన్ పక్షం):** కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 290వ డివిజన్, సుభాష్ నగర్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన పార్టీ కండువాలు కప్పి కొత్తగా చేరిన వారికి సాదర స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, నియోజకవర్గ అభివృద్ధి కోసం చేస్తున్న కృషికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల్లో పార్టీతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో ఎం.డి. నదీమ్, ఎం.డి. తవ్వీజ్, ఎం.డి. రఫీక్, ఎం.డి. మునాఫ్, ఎం.డి. సమద్, ఎం.డి. షఫీ, ఎం.డి. ఉసాన్, ఎం.డి. ఇర్ఫాన్, ఎం.డి. ఆవేజ్, ఎం.డి. అజాస్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో 290వ డివిజన్ అధ్యక్షుడు ద్వారంపూడి నాగిరెడ్డి, నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ అబ్దుల్ గఫ్ఫార్, వైస్ చైర్మన్ ఖైమ్ పాషా, సాయిబాబా నగర్ డివిజన్ మైనారిటీ అధ్యక్షుడు ఎం.డి. యాసీమ్, ఎం.డి. జబ్బర్, షేక్ ఇర్ఫాన్, రవి, రాజు, ఎం.డి. కైఫ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణాదేవి అవతారంలో అమ్మవారి దర్శనం.. అన్నదాన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు



**అమీన్‌పూర్ ప్రతినిధి, అక్టోబర్ 13(విజన్ పక్షం):** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పట్టణ పరిధిలోని బీరంగూడ డివిజన్ రాఘవేంద్ర కాలనీలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈరోజు అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్, అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, భక్తులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశంసా పత్రం అందుకున్న రామన్నపేట ఎస్సై సతీష్ గోపాతి



**ఉమ్మడి నల్లగొండ జిల్లా అక్టోబర్ 13(విజన్ పక్షం):** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం పోలీస్ స్టేషన్ ఎస్సై సతీష్ గోపాతి,బంగారం రాగి తీగలు మేకల దొంగతనాలకు సంబంధించిన కేసులను చేదించినందుకు గాను యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ చేతుల మీదగా ప్రశంసా పత్రం అందుకున్నారు. వీరితోపాటు రామన్నపేట పోలీస్ సిబ్బందికి ప్రశాంత్, ప్రవీణ్, సురేష్, సత్యం తదితరులను ఎస్పీ అభినందించారు.

# శంకర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

## చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య




**శంకర్ పల్లి, అక్టోబర్ 13(విజన్ పక్షం):** శంకర్‌పల్లి మండలం మరియు మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను స్థానిక శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 28 మంది లబ్ధిదారులకు రూ.28,00,448 విలువైన చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆడపిల్లల వివాహంలి తల్లిదండ్రులకు ఆర్థికంగా ఎంతో భారంగా మారుతుంది. అలాంటి కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలు అమలు చేయబడుతున్నాయి. ఈ పథకాలు అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసాను అందిస్తున్నాయి.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సంబంధిత అధికారులు కృషి చేయాలి.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా పథకాలను అమలు చేయాలి.ప్రజల సంక్షేమం,నియోజకవర్గ అభివృద్ధే మా ప్రధాన లక్ష్యం. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తాను. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# దుర్గామాత పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి






**కుత్బుల్లాపూర్,అక్టోబర్13(విజన్ పక్షం దినపత్రిక):** కుత్బుల్లాపూర్ లోని గార్డెన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్,కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు దుర్గామాత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న పూజ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం కమిటీ వారు ఏర్పాటు చేసిన అన్నదాన వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరారెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ...దుర్గామాత దీవెనలతో ప్రజలందరూ సుఖశాంతులతో అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు,కాలనీ వాసులు పెద్దయెత్తున భక్తులు పాల్గొన్నారు.


# బడంగ్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా పవన్ కుమార్ పటేల్ నియామకం

## పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా -- పవన్ కుమార్ పటేల్



**బడంగ్పేట్, అక్టోబర్ 13(విజన్ పక్షం):** మహేశ్వరం నియోజకవర్గం, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బడంగ్‌పేట్ డివిజన్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన అధ్యక్షుడిగా పవన్ కుమార్ పటేల్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఆయనకు బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా పవన్ కుమార్ పటేల్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో బడంగ్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించిన పార్టీ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర రెడ్డికి, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్‌కు, మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ అందెల శ్రీరాములుకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే బడంగ్‌పేట్, నాదెర్గుల్, బాలాపూర్ డివిజన్ల బీజేపీ నాయకులకు, జిల్లా నాయకులకు, శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు. నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ బడంగ్‌పేట్ డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ వికాసానికి శక్తివంచన లేకుండా శ్రమిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# రామడుగు విద్యార్థిని అభినందించిన కేంద్ర సహాయ మంత్రి, నగర మేయర్



**అక్టోబర్ 13(విజన్ పక్షం):** హైదరాబాద్ జూబ్లీ (ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోషియేషన్) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెడ్ టాక్ (ఉపన్యాస) పోటీల్లో రామడుగు మోడల్ స్కూల్ విద్యార్థిని వడ్లూరి శివప్రియ మొదటి స్థానం మరియు తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన ఎలోక్యూషన్ పోటీలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనందున కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరియు కరీంనగర్ మేయర్ శ్రీనివాస్ అభినందనలు తెలియజేశారు.వీరితో పాటు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్,ఉపాధ్యాయులు నాగరాజు,రత్నాకర్,కట్ట రవీంద్రాచారి,శ్రీనివాస చారి,రాజేంద్రా చారి ఉన్నారు...

# నల్లపోచమ్మ దేవాలయంలో అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేష్ గౌడ్



**కూకట్పల్లి ప్రతినిధి, అక్టోబర్ 13(విజన్ పక్షం):** దసరా నవ రాత్రుల శుభసందర్భంగా శంషిగూడ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీ ఫేస్ 2 లోని శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ తల్లి దేవాలయంలో నిర్వహించిన అమ్మవారి ప్రత్యేక పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి అల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. అనంతరం ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని వెంకటేష్ గౌడ్ వారి చేతుల మీదుగా ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాలు అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటూ అందరికి బతుకమ్మ దసరా పండుగ శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో జ.భాస్కర్, పోశెట్టిగౌడ్, కాశినాథ్ యాదవ్, భాస్కర్, వెంకటేష్, హరీష్, సిద్దయ్య, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, శ్రీను, రాజు, శ్రీధర్, శ్రీనివాస్, కాలనీ వాసులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దసరా శరన్నవరాత్రులు.. మూడవ రోజు అన్నపూర్ణాదేవి అవతారం

**హైదరాబాద్ (తెలంగాణ) అక్టోబర్ 13(విజన్ పక్షం):** అన్నదానానికి ప్రతిరూపం.. ఆకలి తీర్చే అమ్మవారి కరుణకు ప్రతీక దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజించడం హిందూ సంప్రదాయంలో విశిష్టమైన ఆచారం. ఈ క్రమంలో మూడవ రోజు అన్నపూర్ణాదేవి అవతారాన్ని స్మరించుకుంటూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అన్నపూర్ణాదేవి సకల జీవరాశులకు ఆహారాన్ని ప్రసాదించే తల్లిగా, ఆకలిని తీర్చి జీవనానికి ఆధారమయ్యే దైవశక్తిగా భక్తుల హృదయాల్లో కొలువై ఉంటుంది.

### అన్నపూర్ణాదేవి అవతారం విశిష్టత

అన్నపూర్ణాదేవి పార్వతీదేవి యొక్క దివ్య స్వరూపంగా పూజలందుకుంటుంది. 'అన్నం' అంటే ఆహారం, 'పూర్ణ' అంటే సంపూర్ణత. సమస్త జీవులకు ఆహారాన్ని అందించి, లోకంలో ఆకలి బాధలు తొలగించి, సుఖసంతోషాలతో జీవించేలా అనుగ్రహించే తల్లిగా అన్నపూర్ణాదేవిని కొలుస్తారు. అమ్మవారి ఒక చేతిలో అన్నపాత్ర, మరో చేతిలో అన్నాన్ని వడ్డించే గరిటె ఉండటం ఆమె అన్నదాన మహిమకు ప్రతీకగా భావిస్తారు. పురాణాల ప్రకారం, ఆహారం యొక్క ప్రాముఖ్యతను లోకానికి తెలియజేసేందుకు పార్వతీదేవి అన్నపూర్ణాదేవిగా అవతరించిందని ప్రతీతి. అన్నం లేకుండా జీవం నిలవదని, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం అత్యంత గొప్ప సేవ అని ఈ అవతారం తెలియజేస్తుంది. అందుకే అన్నపూర్ణాదేవిని ఆరాధించడం ద్వారా కుటుంబంలో అన్నపానాలకు కొరత లేకుండా ఉండాలని, సుఖసంతోషాలు, సిరిసంపదలు కలగాలని భక్తులు ప్రార్థిస్తారు.

### అన్నదానమే మహాదానం

అన్నపూర్ణాదేవి ఆరాధనలో అన్నదానానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. ఆకలితో ఉన్నవారికి కడుపునిండా అన్నం పెట్టడం కేవలం దానం మాత్రమే కాదు.. అది మానవత్వానికి నిదర్శనం. పేదలకు, నిరుపేదలకు, నిరాశ్రయులకు ఆహారం అందించడం ద్వారా అమ్మవారి కరుణను పొందవచ్చని భక్తులు విశ్వసిస్తారు. ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైనంత మేరకు ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించాలని అన్నపూర్ణాదేవి అవతారం సందేశమిస్తుంది.

### భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

శరన్నవరాత్రుల మూడవ రోజు సందర్భంగా ఆలయాల్లో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు, హారతులు నిర్వహిస్తారు. మహిళలు, భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని కుటుంబ సౌభాగ్యం, ఆరోగ్యం, ఐశ్వర్యం, సుఖశాంతులు ప్రసాదించాలని వేడుకుంటారు. కొన్ని ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులకు ప్రసాద వితరణ చేస్తారు. అన్నపూర్ణాదేవి అనుగ్రహంతో ప్రతి ఇంటా అన్నపూర్ణత వెల్లివిరియాలని, ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదని, సమాజంలో సేవాభావం, దయ, దాతృత్వం పెంపొందాలని భక్తులు ఆకాంక్షిస్తారు. అన్నపూర్ణాదేవి సందేశం ఒక్కటే --- ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టండి.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవండి.. మానవత్వాన్ని కాపాడండి. **అన్నపూర్ణేశ్వరి మాతకు జై! జగన్మాతకు జై! ??**

# శరన్నవరాత్రుల్లో మూడో రోజు అమ్మవారు శ్రీ చంద్రఘంటా దేవి అలంకారంలో దర్శనం

**హైదరాబాద్ ( తెలంగాణ) అక్టోబర్ 13(విజన్ పక్షం):** దుష్టశక్తులపై విజయం.. భక్తులకు అభయప్రదానం


హైదరాబాద్, అక్టోబర్ 13: దేశవ్యాప్తంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నవరాత్రుల్లో మూడో రోజుకు విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. ఈ రోజున దుర్గాదేవి మూడో స్వరూపమైన శ్రీ చంద్రఘంటా దేవిని భక్తులు పూజిస్తారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించడం వల్ల ధైర్యం, శక్తి, సాహసం, మనశ్శాంతి లభిస్తాయని భక్తుల విశ్వాసం. పురాణాల ప్రకారం, అమ్మవారి నుదుటిపై గంట ఆకారంలో అర్ధచంద్రుడు ఉండటంతో ఆమెకు చంద్రఘంటా అనే పేరు వచ్చింది. సింహవాహనంపై దర్శనమిచ్చే ఈ అమ్మవారు దుష్టశక్తులను సంహరించి, ధర్మాన్ని కాపాడే శక్తిస్వరూపిణిగా పూజలందుకుంటారు. అమ్మవారి రూపం శాంతికి, సాహసానికి, పరాక్రమానికి ప్రతీకగా నిలుస్తుంది. భక్తులను కష్టాల నుంచి రక్షించి, వారి జీవితాల్లో సుఖశాంతులు కలిగిస్తుందని భక్తులు విశ్వసిస్తారు.

### చంద్రఘంటా దేవి ఆరాధనతో ధైర్యం, ఆత్మవిశ్వాసం

నవరాత్రుల మూడో రోజున భక్తులు తెల్లవారుజామునే ఆలయాలకు చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తారు. పూలతో అలంకరించి, దీపాలు వెలిగించి, కుంకుమార్చనలు చేస్తూ అమ్మవారిని భక్తితో కొలుస్తారు. ఆలయాల్లో మంత్రోచ్ఛారణలు, భక్తిగీతాలు, దుర్గాదేవి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహిస్తూ కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థిస్తారు. చంద్రఘంటా దేవి పది చేతులతో వివిధ ఆయుధాలను ధరించి భక్తులకు దర్శనమిస్తారని పురాణాలు వివరిస్తాయి. ఆమె రూపం చెడుపై మంచి సాధించే విజయానికి ప్రతీకగా భావిస్తారు. జీవితంలో ఎదురయ్యే ఆటంకాలను ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని ప్రసాదించే తల్లిగా అమ్మవారిని భక్తులు ఆరాధిస్తారు.

### ఆధ్యాత్మిక సందేశాన్ని చాటే నవరాత్రులు

శరన్నవరాత్రులు కేవలం పూజా కార్యక్రమాలకే పరిమితం కాకుండా భక్తి, నియమం, ఆత్మవిశ్వాసం, ధర్మబద్ధమైన జీవనానికి మార్గదర్శకంగా నిలుస్తాయి. ప్రతి రోజూ అమ్మవారి ఒక్కో రూపాన్ని ఆరాధించడం ద్వారా శక్తి స్వరూపాల గొప్పతనాన్ని భక్తులు స్మరించుకుంటారు. మూడో రోజు చంద్రఘంటా దేవి ఆరాధన మనిషిలోని భయాన్ని తొలగించి, ధైర్యంగా ముందుకు సాగాలనే సందేశాన్ని అందిస్తుంది. దేవీ శరణు కోరుతూ భక్తులు చేసే ప్రార్థనలు, ఆలయాల్లో జరిగే ప్రత్యేక పూజలు, నైవేద్యాలు, హారతులతో నవరాత్రుల సందడి మరింత పెరుగుతోంది. అమ్మవారి కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలని, ప్రతి ఇంటా సుఖశాంతులు వెల్లివిరియాలని, సమాజంలో ధర్మం, శాంతి, సౌభాగ్యం వర్ధిల్లాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.




జై మాతా దీ! జై శ్రీ చంద్రఘంటా దేవి!

# ఆల్విన్ కాలనీ సర్కిల్లో సిఎంసి కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన


## అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి.. నాణ్యత ప్రమాణాలు పాటించాలి





**సైబరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 13(విజన్ పక్షం):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జవీజ) కమిషనర్ కూకట్‌పల్లి జోన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ సర్కిల్‌లో ఉదయం క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ పరిశీలనలో జోనల్ కమిషనర్, ఎస్ఈ, ఏసీపీ, డీఈ (మెయింటెనెన్స్), డీఈ (రాజెవీ), అన్ని వార్డుల ఏఈలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షామ్నిగూడ, ఆల్విన్ కాలనీ, భాగ్యనగర్ కాలనీ, వివేకానంద నగర్ తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి, పౌర మౌలిక వసతుల పనులను కమిషనర్ పరిశీలించారు. ఇందులో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులు, కాంపౌండ్ వాల్స్, శ్మశానవాటికల అభివృద్ధి, పార్కుల అభివృద్ధి, జజ రోడ్లు తదితర పనులు ఉన్నాయి. క్షేత్రస్థాయి పర్యటనలో ఆయా పనుల పురోగతి, అమలు తీరును కమిషనర్ సమీక్షించారు.

# అర్థ రహితం దోష భరితం



సోషల్ మీడియాలో ఫూటకో కొత్త రూపు సంతరించుకుంటున్నా, ఓటీటీ సంచనాలు సృష్టిస్తున్నా.. స్మార్ట్ దునియాలో ఇప్పటికైతే యూట్యూబ్‌దే హవా! గిగాబైట్ల కొద్దీ ఎంటర్‌టైన్మెంట్ పంచుతున్న యూట్యూబ్ అడ్డాగా బాగుపడ్డవాళ్లు ఎందరో! కానీ, ఇదే యూట్యూబ్ వేదికగా విశృంఖల, విపరీత పైత్యాన్ని ప్రదర్శిస్తున్నారు కొందరు. ఘనాపాఠిని ఇంటర్వ్యూ చేసినా, మేటి నటిని పలకరించినా, గాన కోకిలతో ముచ్చటించినా.. వాళ్లు చెప్పే సంగతుల్లోని అసలు విషయాన్ని పక్కదారి పట్టించే మాయదారి థంబ్‌నెయిల్స్ పెడుతూ పబ్బం గడుపుకొంటున్నారు. అదేమిటంటే.. నెగెటివ్ థంబ్ నెయిల్స్ పెడితే హిట్లు ఎక్కువగా వస్తాయని వ్యాఖ్యానిస్తున్నారు. దశాబ్దాలపాటు తెలుగువారిని అలరించిన ఓ ప్రముఖ గాయనిని మరో విశిష్ట యాంకర్ ఇంటర్వ్యూ చేసింది. అందులో చాలా విషయాలు చర్చకు వచ్చాయి. ఆ ఇంటర్వ్యూను ముక్కలు ముక్కలుగా యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. ఒక్కోదానికీ ఒక్కో చెత్త థంబ్ నెయిల్ పెట్టారు. వీటిలో జాతిరత్నం 'అసహ్యమైన పాటలు పాడించేవాడు' అన్నది. తీరా వీడియోలోకి వెళ్తే అన్నీ మంచి విషయాలే! యాంకర్ అడిగే ప్రతి ప్రశ్నకూ.. ఆ గాయని హుందాగా, సహేతుకంగా సమాధానం చెప్పింది. 'పిల్లలకు పాడాను, అబ్బాయి గొంతులా పాడాను, కొన్నిసార్లు చాలా అసహ్యంగా పాడాల్సిన పాటలూ ఉంటాయి. ఇళయరాజాకు ఎన్ని రకరాల వెరైటీలు పాడాను నేను' అని చెప్పుకొచ్చింది. ఈ వీడియోకు 'అసహ్యమైన పాటలు పాడించేవాడు' అని థంబ్ నెయిల్ తగిలించి, ఇళయరాజా చిత్తరువును ఇన్‌సర్ట్ చేశారు. అక్కడ ఆమె అన్నదేంటి? వీళ్లు పెట్టిదేంటి? పాట ఉన్నంత కాలం చెరగని కీర్తి మూటగట్టుకున్న ఆ మహాగాయని ప్రతిష్ఠకు భంగం వాటిల్లుతుందన్న ఇంగితం కూడా లేకుండా నీచమైన థంబ్‌నెయిల్ పెట్టి పైశాచిక ఆనందం పొందడం ఎందుకో అర్థం కాదు! మరో థంబ్‌నెయిల్ 'ఇళయరాజాకి నేను పాడాను అంటే వచ్చి గొడవ చేసేవారు' అని ఉంది. ఆ యూట్యూబర్ భావన 'పాడను' అంటే.. కానీ, తప్పును కూడా పద్ధతిగా చేయలేని దుస్థితిలో ఉండటం గర్హనీయం. ప్రముఖ గాయని ఇంటర్వ్యూలోనే ఇన్ని అర్థరహితాలు, దోషభరితాలు ఉంటే99% ఓ మోస్తరు కళాకారుల విషయంలో ఇంకెంతటి వైపరీత్యాలు ప్రదర్శిస్తున్నారో ఊహించుకోవచ్చు.

# కరెంట్ మీటర్



మనుషులను శుభ్రం చేసే వాషింగ్ మెషీన్ ఇటీవల వార్తల్లో నిలిచింది. దీనిని రూపొందించిన సంస్థ ఏది? ప్రపంచంలోనే అరుదుగా కనిపించే ఓ పక్షి.. మహబూబాబాద్ జిల్లాలోని భీముని పాదం జలపాతం దగ్గర ఓ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ కెమెరాకు చిక్కింది. ఆ పక్షి పేరేంటి? శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో విహరించే 'షికారా' చెక్క పడవలను తమ యాప్ ద్వారా బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పించిన సంస్థ ఏది? హైదరాబాద్ చరిత్రలో అంతర్భాగమైన ఓ భవనం.. జాతీయ స్థాయి మేధో సంపత్తి హక్కుల పరిరక్షణ విభాగంలో 'ట్రేడ్‌మార్క్' పొందనున్నది. దక్షిణ భారతదేశంలో తొలిసారిగా ఈ ఘనత సాధించనున్న ఆ భవనం ఏది? రాష్ట్రంలోని ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్లినిక్‌ల పేరేంది? సూర్యుడి వెలుపలి వలయమైన 'కరోనా'పై లోతైన పరిశోధనలు చేయడానికి ఐరోపా అంతరిక్ష సంస్థ ఇటీవల ఓ వినూత్న ప్రయోగం చేపట్టింది. ఆ ప్రయోగాన్ని ఏమని పిలుస్తున్నారు? సైబర్ నేరగాళ్లు తెరుస్తున్న 'మ్యూల్ అకౌంట్స్'ను ఏరివేయడమే లక్ష్యంగా ఆర్బీఐ ఆవిష్కరించిన ఏఐ మోడల్ ఏది? భోపాల్ నగరాన్ని మృత్యుదిబ్బగా మార్చిన 'గ్యాస్ దుర్ఘటన'కు ఇటీవలే 40 ఏళ్లు పూర్తయాయి. ఏ కర్మాగారం నుంచి గ్యాస్ లీకై.. వేల మంది మరణాలకు కారణమైంది? టీ20ల్లో 40 బంతుల్లోపు రెండు శతకాలు సాధించిన తొలి ఆటగాడిగా తాజాగా రికార్డు సృష్టించిన యువ క్రికెటర్ ఎవరు? భారత అమ్ముల పొదిలోకి ఓ సరికొత్త అస్త్రం వచ్చి చేరింది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఆ అధునాతన సెల్ఫ్ డిస్ట్రాయ్ డ్రోన్ ఏది?

# హైదరాబాద్‌లో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల మృతి



**నిజంగా న్యూస్ హైదరాబాద్ (తెలంగాణ ) అక్టోబర్ 13:** ఒకరిది అనుమానాస్పద మృతి.. మరొకరిది ఆత్మహత్య మానసిక ఆరోగ్యం, దీర్ఘకాలిక అనారోగ్యంపై మరోసారి చర్చ

**హైదరాబాద్:** నగరంలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వేర్వేరు ఘటనల్లో మృతి చెందడం కలకలం రేపింది. నానక్‌రామ్‌గూడలో 29 ఏళ్ల ఉప్పల భరత్ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందగా, కొండాపూర్‌లో 36 ఏళ్ల సౌరభ్ శేఖర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. సూర్యాపేట జిల్లాకు చెందిన ఉప్పల భరత్ బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఘటనకు రెండు రోజుల ముందే నానక్‌రామ్‌గూడలోని గోల్ఫ్ ఎడ్జ్ అపార్ట్‌మెంట్స్‌లో అద్దె ఫ్లాట్‌కు మారాడు. సోమవారం 30వ అంతస్తు నుంచి కిందపడటంతో తీవ్రంగా గాయపడగా, ఆసుపత్రికి తరలించినప్పటికీ ప్రాణాలు దక్కలేదు. బంధువు ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరో ఘటనలో హర్యానాకు చెందిన సౌరభ్ శేఖర్ కొండాపూర్‌లోని తన స్నేహితుడి ఫ్లాట్‌లో మృతి చెంది కనిపించాడు. రాయదుర్గంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న ఆయన దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. కుటుంబ సభ్యులకు అందుబాటులో లేకపోవడంతో అతని సోదరుడు ఫ్లాట్‌కు వెళ్లి చూడగా ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ రెండు ఘటనలు ఐటీ ఉద్యోగుల మానసిక ఆరోగ్యం, దీర్ఘకాలిక అనారోగ్యం, పని ఒత్తిడి వంటి అంశాలపై చర్చకు దారితీశాయి. అయితే ఈ మరణాలకు పని ఒత్తిడే కారణమని నిర్ధారణ కాలేదు. ఘటనల వెనుక పూర్తి కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఉద్యోగుల ఆరోగ్యంపై సంస్థలు, కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని ఈ ఘటనలు గుర్తుచేస్తున్నాయి.

# ప్రతీకారమే కాంగ్రెస్ రాజకీయం



కక్ష, కార్పణ్యాలు చొరబడితే పగ, ప్రతీకారాలతో రాజకీయాలు రగిలిపోతాయని నడుస్తున్న చరిత్ర చెప్తున్నది. అధికారమిచ్చిన ప్రజల కోసం కాకుండా పాలానా కాలమంతా కేసులు, జైళ్లు, ప్రతీకారంపైనే దృష్టిసారించిన రాజ్యాలేవీ నాటి నుంచి నేటి వరకూ మనుగడ సాగించిన దాఖలాలు చరిత్రలో లేవు. రాజ్యాలు మారినా, రాజులు పోయినా నాటి రాజకీయాలే నడుస్తుండటం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చలా పరిణమిస్తున్నది. ఇవాళ రాజకీయ పార్టీలు చట్టాలను దుర్వినియోగం చేస్తూ తమ రాజకీయ శత్రువులపై వాటిని ప్రయోగించడం దేశ రాజకీయాల్లో సాధారణ విషయంగా మారడం రాజ్యాంగానికి ప్రమాదకరం. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు, ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలని పోలీసులు, పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు, మంచి బువ్వ కోసం హాస్టళ్ల విద్యార్థులు, రైతుబంధు, రుణమాఫీ కోసం రైతన్నలు, వేతనాల కోసం ఆశావర్కర్లు, ఆటోడ్రైవర్లు, హైడ్రా, మూసీ బాధితులు, లగచర్ల, దిలావర్‌పూర్ రైతాంగం.. ఇలా చెప్పుకొంటూపోతే కాంగ్రెస్ ఏడాది పాలనలో రోడ్డెక్కని వర్గమే లేదు. నిరసన తెలపని బాధితులూ లేరు. తెలంగాణలో ప్రజాపాలన కాస్త ప్రతీకార పాలనగా మారిందన్నది సుస్పష్టం. అధికారమే శాశ్వతమని, సింహాసనం తమ సొంతమని భావిస్తూ కాంగ్రెస్ సర్కారు, ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న ఆవేశపూరిత, ప్రతీకారేచ్ఛ నిర్ణయాలపై తెలంగాణ సమాజం లోతుగా అధ్యయనం చేస్తున్నది. అసాధ్యమనుకున్న స్వరాష్ట్రం కలను సుసాధ్యం చేసిన తెలంగాణ జాతిపిత, ఉద్యమ కెరటం కేసీఆర్‌పై, బీఆర్ఎస్ పార్టీపై, నాయకత్వంపై సాగుతున్న కుట్ర కోణం అంతా ఇంతా కాదు. బీఆర్ఎస్ అనే మొక్కనే మొలవనివ్వనని బహిరంగంగా తన కసిని, కోపాన్ని వెళ్లగక్కిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతీకారేచ్ఛతో రగిలిపోతూ పాలన కంటే కేసులపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. 14 ఏండ్ల పాటు తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించి, పదేండ్లు ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి సేవలందించిన కేసీఆర్‌ను కేసుల్లో ఇరికించి జైల్లో పెట్టాలన్నది ముఖ్యమంత్రి ఉవాచ అని స్పష్టమవుతున్నది. అంతెందుకు తన పేరు ఉచ్చరించలేదనే కారణంతో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను జైల్లో పెట్టి వికృతానందం పొందిన రేవంత్ అటిట్యూడ్‌ను ఇవాళ తెలంగాణ సమాజం నిశితంగా గమనిస్తున్నది. కేసీఆర్‌పై రేవంత్ ప్రతీకారం వెనుక ఓటుకు నోటు కేసు ఉన్నదనే విషయం స్పష్టంగా తెలుస్తున్నది. కొత్తగా తెచ్చుకున్న రాష్ట్రాన్ని, ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రల్లో భాగంగా చంద్రబాబుతో చేతులు కలిపి అడ్డంగా దొరకడంతో నాటి ప్రభుత్వం చట్టప్రకారం చర్యలు తీసుకున్నది. ఆ కారణంగానే ఇప్పుడు కేసీఆర్‌ను జైల్లో వేయాలని రేవంత్ ఉబలాటపడుతున్నారు. అందులో భాగంగానే కాళేశ్వరం కమిషన్, విద్యుత్ కొనుగోళ్ల నివేదిక తదితర అంశాల ఆధారంగా చర్యలుంటాయని లీకులిస్తున్నారు. కాళేశ్వరంతో తెలంగాణ ఎలా సస్యశ్యామలమైనదో ప్రపంచానికి తెలుసు. కారుచీకట్లో ఉన్న తెలంగాణను కరెంట్ వెలుగులతో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా మార్చిన ఘనత కూడా కేసీఆర్‌దే. ఈ రాష్ట్ర రైతాంగానికి పొలం నిండా నీళ్లు.. కల్లం నిండా కరెంట్ ఇచ్చిన పాపానికి కేసీఆర్‌ను జైల్లో వేయాలని రేవంత్ ఆరాటపడుతున్నట్టు తాజా క్యాబినెట్ భేటీతో రూఢీ అయింది. ఇక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఇంటిపై డ్రోన్లు ఎగురవేసి, ఆయన ప్రైవసీకి భంగం కలిగించి, కుట్రకు పాల్పడిన రేవంత్‌పై నాటి సర్కారు చర్యలు తీసుకుంది. దాన్ని మనసులో పెట్టుకున్న ఆయన ప్రతీకారంతో అధికారంలోకి రాకముందే కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో వేస్తానని, జైలులో డబుల్ బెడ్రూం కట్టిస్తానని పదే పదే చెప్పారు. రేవంత్ మాటలను బట్టి ఆయన గమనం ఎటుపోతున్నదో అవగతమవుతున్నది. అందుకోసమే ఈ- కార్ రేసింగ్, ఇతరత్రా అంశాలను కేటీఆర్ చుట్టూ తిప్పుతున్నారు. ఏడాదిలోనే కేటీఆర్‌పై 10 కేసులను నమోదు చేశారు. ఈ నేపథ్యంలో సంబంధం లేని కేసుల్లో ఇరికించి జైలుకు పంపించాలన్నది రేవంత్ కుట్రగా అందరికీ తెలుస్తున్నది. ఇక ఎలాంటి ఆధారాలు లేని ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావును ఇరికించి, జైలుపాలు చేయాలని రేవంత్ ఉవ్విళ్లూరుతున్నారు. బీఆర్ఎస్, కేసీఆర్‌ను రాజకీయంగా ఖతం చేసేందుకు రెండు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ చేయని ప్రయత్నమే లేదు. కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను కూకటివేళ్లతో పెకిలించే వ్యూహంతోనే రేవంత్ పాలన సాగుతున్నది. కేసీఆర్, కేటీఆర్‌ను అరెస్ట్ చేసి కట్టడి చేయడం ఎట్లనో ఇటీవల క్యాబినెట్‌లో భేటీలో మంత్రివర్గ సభ్యులకు సీఎం రేవంత్ హితబోధ చేసిన తీరు, త్వరలో పొలిటికల్ బాంబులు పేలుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పదేపదే పునరుద్ఘాటిస్తున్న వైనం, కోమటిరెడ్డి సహా మిగతా మంత్రులు వంతపాడుతుండటం మనం చూస్తూనే ఉన్నాం. ప్రజల్లోంచి పుట్టిన ఉద్యమ పార్టీని కేసులతో, జైళ్లతో బెదిరించగలరా? జన బాహుళ్యం నుంచి వచ్చే నిరసనలను చవిచూడగలరా? ఏడాదిలోనే నూరు శాతం వ్యతిరేకతను మూటగట్టుకున్న రేవంత్ సర్కారు ప్రతీ వర్గం నుంచి ఆందోళనలను ఎదుర్కొంటున్నది. ప్రజల కోసం, ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రభుత్వం ప్రజల గురించి ఆలోచించాల్సింది పోయి ఇవాళ ప్రతిపక్ష పార్టీని ఖతం చేయాలన్న దురుద్దేశంతో ముందుకు పోతున్నది. ఈ వైఖరి రేవంత్ సర్కార్‌కు పెనుశాపంలా మారుతుంది. అరచేతిని అడ్డుపెట్టుకొని సూర్యకాంతిని ఎవరూ ఆపలేరనే నగ్నసత్యాన్ని పాలకులు గ్రహించాలి. అలాగే ఉద్యమ దివిటీలను ముట్టుకుంటే మరో ఉప్పెన వస్తుందని తెలుసుకుని మసులుకుంటే మంచిది.

# భోజనం చేసిన వెంటనే సోంపు తింటే ఇన్ని ప్రయోజనాలా తెలిస్తే వెంటనే మొదలు పెడతారు



భోజనం చేసిన అనంతరం చాలా మంది రకరకాల ఆహారాలను తింటుంటారు. లేదా జ్యూస్‌లు, ఇతర డ్రింక్స్‌ను సేవిస్తుంటారు. భోజనం చేశాక కొందరు టీ, కాఫీ తాగుతారు. అయితే వాస్తవానికి భోజనం చేసిన అనంతరం సోంపు గింజలను తింటుండాలి. మన పెద్దలు భోజనం చేసిన వెంటనే సోంపు గింజలను నోట్లో వేసుకుని నమిలే వారు. అందుకనే వారు ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు. కానీ మనం అలా చేయడం లేదు. దీంతో అనారోగ్యాల బారిన పడుతున్నాం. భోజనం చేసిన అనంతరం సోంపు గింజలను నమలడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు సైతం చెబుతున్నారు. మనకు కలిగే అనారోగ్య సమస్యలను నయం చేయడంలో సోంపు గింజలు ఎంతగానో పనిచేస్తాయి. భోజనం చేసిన వెంటనే సోంపు గింజలను గుప్పెడు తీసుకుని నమిలితే ఎన్నో లాభాలను పొందవచ్చు.

### జీర్ణ వ్యవస్థ పనితీరుకు..

సోంపు గింజల్లో అనేక పోషకాలు ఉంటాయి. పోషకాలకు వీటిని గనిగా చెప్పవచ్చు. ఈ గింజల్లో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి, పొటాషియం, మెగ్నిషియం సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల ఈ గింజలను తింటే మనకు పోషణ లభిస్తుంది. ఈ పోషకాలు మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రోగాల నుంచి రక్షిస్తాయి. భోజనం చేసిన వెంటనే సోంపు గింజలను తినడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఈ గింజల్లో అనెథోల్ ఉంటుంది. ఇది జీర్ణాశయ ఎంజైమ్‌లను ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో జీర్ణక్రియ మెరుగు పడుతుంది. అలాగే కడుపు ఉబ్బరం, అసిడిటీ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

### నోటి దుర్వాసన తగ్గుతుంది..

సోంపు గింజల్లో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. కనుక ఈ గింజలను నోట్లో వేసుకుని నమిలితే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోరు శుభ్రమవుతుంది. నోటి దుర్వాసన నుంచి విముక్తి లభిస్తుంది. కనుకనే భోజనం చేసిన అనంతరం నోరు శుభ్రంగా ఉండేందుకు మన పెద్దలు అప్పట్లో సోంపు గింజలను నమిలే వారు. అలాగే ఈ గింజలను నమిలితే ఫైబర్, మినరల్స్ సమృద్ధిగా లభిస్తాయి. ఇవి శరీర మెటబాలిజంను పెంచుతాయి. దీంతో క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. ఫలితంగా శరీరంలో ఉండు కొవ్వు కరుగుతుంది. దీని వల్ల అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలని చూస్తున్న వారు భోజనం చేసిన అనంతరం రోజూ సోంపును తింటుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది.

### బీపీ కంట్రోల్ అవుతుంది..

సోంపు గింజల్లో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ముఖ్యంగా ఫ్లేవనాయిడ్స్, క్వర్సెటిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఈ గింజల్లో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో కణాలు డ్యామేజ్ అవకుండా ఉంటాయి. అలాగే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. కాబట్టి భోజనం చేసిన వెంటనే సోంపు గింజలను తినడం అలవాటు చేసుకోవాలి. అలాగే ఈ గింజల్లో ఉండే పొటాషియం శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో హైబీపీ తగ్గుతుంది. బీపీ ఉన్నవారికి సోంపు గింజలు ఒక వరమనే చెప్పవచ్చు. వీటిని రోజూ తింటుంటే బీపీని కంట్రోల్ చేయవచ్చు. ఇలా భోజనం చేసిన వెంటనే సోంపు గింజలను నమలడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# వర్చువల్ భ్రాంతి వాస్తవానికి అశాంతి

లైక్‌లే నిజాలు అనుకుంటున్నారా? కామెంట్లే కొలమానాలుగా భావిస్తున్నారా? రోజుకో డీపీ మార్చుకుంటూ99% వర్చువల్ ఇమేజ్‌ను పెంచుకుంటూ పోతున్నారా? ఇలాంటి లక్షణాలు ఉన్నాయంటే.. మీరు బిల్డప్ బుల్లెమ్మలే! డిజిటల్ చట్రంలో ఇరుక్కుపోతే ఎప్పుడో ఫేక్ అయిపోతారు జాగ్రత్త!! ఈ తరం యువతీయువకుల్లో ఈ ఫేక్ ఐడెంటిటీ భావన వారికి తెలియకుండానే ముదిరిపోతున్నదట! లేనివి ఉన్నట్టుగా ఊహించుకుంటూ, తమ వాస్తవ పరిస్థితిని అసహ్యించుకునే స్థాయికి వెళ్లిపోతున్నారట. వర్చువల్ లైఫ్, రియల్ లైఫ్‌ను బ్యాలెన్స్ చేయలేక మనోవ్యథకు గురవుతున్నారట!! శ్రావ్య కాస్త బొద్దుగా ఉంటుంది. ముద్దుగానే ఉంటుంది. కానీ, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లో మాత్రం స్లిమ్‌గా, హాట్‌గా కనిపించే పిక్‌లు పెడుతుంది. వాటికొచ్చే లైక్‌లు, కామెంట్లు చూసుకొని మురిసిపోతుంది. వర్చువల్ ఇమేజ్ కోసం సోషల్ మీడియాలో తెగ యాక్టివ్‌గా ఉంటుంది. కానీ, నిజమేంటో ఆమెకు తెలుసు. ఆ నిజం ఆమెను ఒత్తిడికి గురిచేస్తున్నది!! విశాల్ మధ్యతరగతి అబ్బాయి. ఒకరోజు ఫ్రెండ్ బైక్ మీద ట్కస్టైల్‌గా రేబాన్ కళ్లజోడు పెట్టుకుని తీసుకున్న సెల్ఫీ ప్రొఫైల్ పిక్‌గా పెట్టాడు. ఏఐ ఎడిటింగ్స్‌తో సాదాసీదా బాడీకి ఫిట్‌నెస్ కూడా అద్దాడు. హీరోలా కనిపించేసరికి విపరీతంగా లైకులు వచ్చిపడ్డాయి. అమాంతంగా వచ్చిన స్టార్‌డమ్‌ను ఎంజాయ్ చేయాలనుకున్నాడు. ఫ్రెండ్స్‌తో షాపింగ్ మాల్స్ చుట్టేస్తూ, కారులో విహరిస్తూ.. దిగిన ఫొటోలు అప్‌లోడ్ చేస్తూ పోయాడు. ఫాలోవర్లూ పెరిగారు. కానీ, అతను పెట్టుకున్న కళ్లజోడు, తిరుగుతున్న కారు.. ఇవేవీ తనవి కావు. కానీ, సోషల్ మీడియాలో చూసేవారంతా విశాల్ రేంజ్ వేరని ఫిక్సయ్యారు. అంతేకాదు, తనని కూడా అలా ఫిక్సయ్యేలా భ్రమ కల్పించారు. కానీ, విశాల్ మనసులో ఏదో ఒక మూల తెలియని అశాంతి. దీంతో తను ఇష్టంగా తొక్కే సైకిల్‌తో సెల్ఫీ తీసుకోలేని పరిస్థితికి వచ్చేశాడు. వర్చువల్ ప్రపంచంలో విహరిస్తున్న యువతీయువకులు కూడా అచ్చం శ్రావ్య, విశాల్ లాగానే ప్రవర్తిస్తున్నారు. ఫేక్ ఐడెంటిటీని మాస్క్‌లా తగిలించుకొని సోషల్ దునియాను దున్నేస్తున్నామని భావిస్తున్నారు. ముఖ్యంగా యువతులు ఈ డిజిటల్ అట్రాక్షన్స్‌కు ఎక్కువగా గురవుతున్నారని పలు సర్వేలు హెచ్చరిస్తున్నాయి. తమను తాము ఓ బ్రాండ్‌గా ప్రొజెక్ట్ చేసుకోవాలనే తపనే.. చాలామంది అమ్మాయిలను సోషల్ లైఫ్‌కు దగ్గర చేస్తున్నదని మానసిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాస్తవ ప్రపంచంలో ఒకలా, సోషల్ మీడియాలో మరొకలా వ్యవహరిస్తూ.. ఒక్కరిలోనే ఇద్దరు ఉంటున్నారు. మీలోనూ ఆ ఇద్దరు ఉన్నారా? సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలని చాలామంది ఆరాటం. బయట ఎలా ఉన్నా.. ఎఫ్‌బీ, ఇన్‌స్టాల్లో ఆదర్శభావాలను వల్లిస్తుంటారు. ఎక్కడో బ్రౌజింగ్‌లో కనిపించిన కొటేషన్లను స్టేటస్‌గా పెట్టేసి గొప్పగా ఫీలవుతారు. దాన్ని ఎంతమంది చూశారు, ఎవరెలా రెస్పాండ్ అయ్యారు అని తరచూ చెక్ చేసుకుంటూ ఉంటారు. నాలుగు లైకులు రాగానే నెట్టింట్లో అందరూ తమనే ఫాలో అవుతున్నారని ఊహించుకుంటారు. కానీ నిజ జీవితానికి వచ్చేసరికి ఆ కొటేషన్‌లో చెప్పిన ఆదర్శభావాలు పాటిస్తున్నామా అన్న ప్రశ్న ఉదయించగానే మానసిక సంఘర్షణకు గురవుతున్నారు. ఈ క్రమంలో డిజిటల్ ప్రపంచంలో సంపాదించుకున్న డమ్మీ ఇమేజ్‌ను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంటారు కానీ, తమ రియల్ లైఫ్‌ను అంగీకరించలేరు.

### పరిధి దాటొద్దు

వాస్తవ ప్రపంచంలో అయినా.. సోషల్ వరల్డ్ లో అయినా.. స్థిమితంగా ఉండటం అవసరం. పదే పదే డీపీ మార్చేయడం, అదేపనిగా స్టేటస్ చెక్ చేయడం.. లాంటి వైఖరులు సోషల్‌లైఫ్‌లో మీరు స్థిరంగా లేరన్న దానికి సంకేతంగా భావించాలి. ఎవరిదో బెంజి కారు పార్క్ చేసి ఉంటే సెల్ఫీ తీసుకుని సోషల్ మీడియాలో పోస్టు చేస్తుంటారు కొందరు. దానికొచ్చే లైక్‌లు, కామెంట్లతో ఎంజాయ్ చేస్తారు. ఈ ఆర్భాటం మీ జీవితాన్ని అగాథంలోకి నెట్టే ప్రమాదం ఉంది. లేనిది ఉన్నట్టుగా చూపించాలనుకోవడం ప్రమాదకరం. వర్చువల్ లైఫ్‌ను ఆస్వాదించడం మొదలైతే.. వాస్తవ జీవితంలోకి రావడానికి ధైర్యం సరిపోదు. ఎందుకంటే.. రకరకాల ఫిల్టర్లు, కెమెరా ఆప్షన్లు వాడి మీ అసలు ముఖాన్ని చెరిపేశారు. మీ ఫాలోవర్లు మీ వాస్తవ రూపం చూడాలనుకుంటే మీరెలా స్పందిస్తారు? ఆ పరిస్థితే వస్తే ఫేస్ చేయగలరా? ఆ ఒత్తిడిని తట్టుకోగలరా? మీరో బ్రాండ్ అవ్వడం అంటే.. మీదైన ప్రత్యేకతను చాటుకోవాలి. అంతేకానీ, అరువు తెచ్చుకున్న అందాలను అద్దుకొని మురిసిపోవడం కాదు! మీకున్న టాలెంట్‌తో సోషల్ వేదికల్లో పరిచయమవ్వండి. నిజాయతీగా ప్రయత్నిస్తే ఎప్పటికైనా మీరు ఆశించిన సెలెబ్రిటీ హోదా దక్కుతుంది. మరో మాట పనివేళల్లో, ఆఫీస్ కంప్యూటర్స్‌లో సోషల్ మీడియా సర్వీసులను యాక్సెస్ చేయొద్దు. సామాజిక మాధ్యమాల్లో లైక్‌లే పరమావధిగా ఏది పడితే అది షేర్ చేయొద్దు. ఓ పరిధి మేరకే విషయాలను పంచుకోవాలన్న విషయాన్ని గ్రహించాలి. వర్చువల్‌లో ధరించిన ఫేక్ ముసుగు.. రియల్ వరల్డ్‌లో మీ ఇమేజ్‌ని అమాంతం నేలకు దించేస్తుందని మర్చిపోవద్దు.

### ఎడిటింగ్ మాయ కొంత

సోషల్ మీడియా మయసభను మించిన మాయా ప్రపంచం! కృత్రిమ మేధకు దత్త సంతతిలా పుట్టుకొచ్చిన ఎడిటింగ్ ఫీచర్లు అస్త్రాలుగా చాలామంది రకరకాల గిమ్మిక్కులు చేస్తున్నారు. ఫేక్ పోస్టింగులు పెడుతున్నారు. లావుగా ఉన్నవాళ్లు మెరుపుతీగలా కనిపించేలా మాయ చేస్తున్నారు. బానపొట్టతో ఉన్న పురుషుడి ఫొటో ఏఐ సాయంతో సిక్స్‌ప్యాక్‌లోకి మారిపోతున్నది. వీటిని ఫాలో అయ్యేవారు ఆ క్షణం మురిసిపోయి లైక్ కొట్టి ఊరుకుంటారు. అక్కడితో వాళ్ల పాత్ర ముగిసిపోతుంది. ఆ లైకుల ప్రభావంతో ఇమేజ్ చట్రంలో ఇరుక్కుపోతున్నారు కొందరు. అయితే ఈ ఫేక్ ఎన్నోరోజులు నిలబడదు. సోషల్ మీడియా అకౌంట్‌లో ఉన్న మీరు.. అసలైన మీరు కాదని ప్రపంచానికి తెలియకపోవచ్చు. కానీ, ఏదో ఒకరోజు.. 'అది నేను కాదు!' అన్న నిజాన్ని మీరు అంగీకరించక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు మనసు, మెదడూ రెండూ ప్రశ్నిస్తాయి. మీరు 'ఒక్కరా? ఇద్దరా?', 'నీ నిజ స్వరూపం ఏది?' అని. అప్పటికైనా వాస్తవం గుర్తించగలిగితే ఫర్వాలేదు. ఇంకా భ్రమల్లోనే ఉంటామంటే మిమ్మల్ని మీరు మోసం చేసుకున్నట్టే!



Flat No: G-2, Mount Nasir Apartment, 6-1-57 to 61, Saifabad, Hyderabad9441221980